

పేలుతున్న టపాసుల ధరలు

గత ఏడాదితోపోలిస్తే 10-20 శాతం అధికం

- వర్షంతో సాయంత్రం వరకు మందకొడిగా కొనుగోళ్లు
- రాత్రి తరువాత ఊపందుకున్న అమ్మకాలు



అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బాణసంచా స్టాళ్లలో కొనుగోలుదారుల సందడి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా జిల్లాలో బాణసంచా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆయా శాఖల అధికారుల అనుమతుల మేరకు అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, పాయకరావుపేట పట్టణాలతోపాటు అన్ని మండల కేంద్రాల్లో నివాసాలకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పలుచోట్ల దఫదఫాలుగా వర్షం పడడం, సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతంగా వుండడంతో అమ్మకాలు మందకొడిగా సాగాయి. రాత్రి ఏడు గంటల నుంచి దుకాణాల వద్ద క్రమేపీ రద్దు పెరిగి, బాణసంచా విక్రయాలు ఊపందుకున్నాయి. ఎప్పటి మాదిరిగానే ధరలు మండిపోతున్నాయని, గత ఏడాదితో పోలిస్తే పది నుంచి 20 శాతం వరకు పెరిగాయని అంటున్నారు. గత ఏడాది కాకర పువ్వొత్తులు (రంగులు) పది ప్యాకెట్లు రూ.300లకు లభించగా ఈసారి బ్రాండ్‌నుబట్టి రూ.350 నుంచి రూ.400లకు అమ్ముతున్నారు. సాధారణ కాకర పువ్వొత్తులు రూ.150 నుంచి రూ.200కి, భూచక్రాల బాక్స్ రూ.150 నుంచి రూ.200లకు పెరిగాయి. ప్రస్తుతం రూ. 200లకు అమ్ముతున్నారని చెబుతున్నారు. సోమవారం వర్షం లేకపోతే అమ్మకాలు బాగుంటాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల కోసం జెండర్ రిసోర్స్ సెంటర్లు

నక్కపల్లి, రావికమతంలో ఏర్పాటు

- త్వరలో నర్సీపట్నంలో ఏర్పాటుకు సన్నాహాలు
- జిల్లాలో మరో మూడు ఏర్పాటుకు ప్రతిపాదనలు
- గ్రామ, మండల సోషల్ యాక్షన్ కమిటీలకు శిక్షణ
- మండల సమాఖ్యలోని మహిళల సమస్యల పరిష్కారానికి కృషి






నర్సీపట్నంలో జెండర్ రీసోర్స్ సెంటర్. (ఇన్‌సెట్‌లో) ఫిర్యాదుల పెట్టె

నర్సీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు, మండల సమాఖ్యలోని మహిళల ఆర్థిక, సామాజిక, చట్టపరమైన సమస్యల పరిష్కారానికి జెండర్ రీసోర్స్ సెంటర్లు (లింగ వనరుల కేంద్రాలు) సేవలు అందిస్తున్నాయి. జిల్లాలో 2023-24లో రావికమతం మండలంలో జీఆర్‌సీ సెంటర్ ఏర్పాటు చేశారు. తరువాత 2024-25లో నక్కపల్లి, కె.కోటపాడుకి కేంద్రాలు మంజూరయ్యాయి. నక్కపల్లి జెండర్ రీసోర్స్ సెంటర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కె.కోటపాడులో కేంద్రం ప్రారంభం కావల్సి ఉంది. 2025-26లో నర్సీపట్నానికి జీఆర్‌సీ మంజూరైంది. త్వరలో వీటి సేవలు అందుబాటులోకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నారు. మరో మూడు కేంద్రాలు అనకాపల్లి, రాంబిల్లి, పరవాడలో ఏర్పాటు చేయడానికి డీఆర్‌డీఏ పీడీ శశీదేవి ప్రతిపాదనలు పెట్టారు. ప్రతీ నియోజకవర్గంలో ఒక జెండర్ రీసోర్స్ సెంటర్ ఉండాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు.

జెండర్ రీసోర్స్ సెంటర్ ముఖ్య ఉద్దేశం ఇదీ..

గ్రామ, మండల సమాఖ్య సంఘాల్లోని సభ్యులతో సామాజిక కార్యాచరణ కమిటీలు ఏర్పాటు చేస్తారు. గ్రామ కమిటీలో ముగ్గురు, మండల కమిటీలో ఐదుగురు చొప్పున సభ్యులుగా ఉంటారు. వీరికి డీఆర్‌డీఏ తరఫున జెండర్ రీసోర్స్ సెంటర్ల ... మిగతా 8వ పేజీలో

రిజర్వాయర్లకు వరద తాకిడి



గేట్లు ఎత్తిన కళ్యాణపులోవ రిజర్వాయర్

రైవాడకు 3 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- మూడు గేట్లు ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీరు నదిలోకి విడుదల
- కోనాం-300, కల్యాణపులోవ- 250, పెద్దేరు-200 క్యూసెక్కులు..

దేవరాపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయానికి వరద పోటెత్తింది. పరీవాహక ప్రాంతమైన ఏజెన్సీలో భారీ వర్షాలు కురుస్తుండడంతో సమ్మెద గెడ్డ, చల్లగెడ్డల ద్వారా సుమారు మూడు వేల క్యూసెక్కులకుపైగా వరద నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతున్నది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, శనివారం రాత్రి నుంచి ఇన్‌ఫ్లో క్రమేపీ పెరుగుతున్నది. దీంతో ఒక గేటు ఎత్తి 400 క్యూసెక్కుల నీటిని శారదా నదిలోకి విడుదల చేశారు. ఆదివారం ఉదయం నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో అవుట్‌ఫ్లోను కూడా పెంచుకుంటూ పోతున్నారు. ఆదివారం సాయంత్రానికి మూడు వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీటిమట్టం 113.83 మీటర్లకు చేరడంతో మొత్తం మూడు గేట్లు ఎత్తి నాలుగు వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. దేవరాపల్లి, చోడవరం, అనకాపల్లి, కశింకోట, మునగపాక, రాంబిల్లి మండలాల్లో శారదా నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని డీఈఈ సత్యంనాయుడు తెలిపారు.

300క్యూసెక్కులు వరదనీరు విడుదల

చీడికాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం జలాశయంలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లుకాగా.. ఆదివారం 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 100.1 మీటర్లకు చేరింది. వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ఆదివారం సాయంత్రం స్పిల్‌వే గేట్ల నుంచి 300 క్యూసెక్కుల నీటిని బొడ్డేరు నదిలోకి విడిచిపెడుతున్నట్టు జలాశయం ఏఈఈ సత్యనారాయణదొర తెలిపారు.



రైవాడ జలాశయం గేట్ల నుంచి నదిలోకి విడిచిపెడుతున్న నీరు

కల్యాణపులోవ నుంచి 250 క్యూసెక్కులు..

రావికమతం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు ... మిగతా 8వ పేజీలో

భారీ వర్షంతో జలమయం

అచ్యుతాపురం, 'పేటల్లో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

- డ్రైనేజీలు పొంగి.. వాగులను తలపించిన రోడ్లు
- రాకపోకలకు వాహనదారుల ఇక్కట్లు



అచ్యుతాపురంలో కురుస్తున్న వర్షం

అచ్యుతాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం అర్ధరాత్రి తర్వాత మొదలైన వర్షం.. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు ఆగకుండా కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వర్షం నీరు రహదారులపై ప్రవహించడంతో కాలువలను తలపించాయి. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. వర్షం కారణంగా రహదారులపై ఎక్కడ గోతులు వున్నాయో తెలియక వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. వర్షం కారణంగా బాణసంచా విక్రయదారులు ఆందోళన చెందారు. వాతావరణం మసుగ్గా వుండడం తోపాటు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షాపుల ముందు బురదగా వుండడంతో సాయంత్రం వరకు దుకాణాలు తెరవలేదు. కాగా ఉదయం ఎనిమిది గంటల తరువాత వర్షం ... మిగతా 8వ పేజీలో

మానవత్వం చాటుకున్న హోం మంత్రి అనిత

- కాన్వాయ్‌ని ఆపి క్షతగాత్రుడికి పరామర్శ
- మంత్రి ఆదేశాలతో వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లిన పోలీసులు



క్షతగాత్రుడి వివరాలు తెలుసుకుంటున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మరోసారి ఉదారతను, మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఆదివారం ఉదయం మంత్రి కాన్వాయ్ క్యాంపు కార్యాలయం నుంచి నెల్లూరు బయలుదేరింది. అడ్డరోడ్డు వద్ద యూ టర్న్ తీసుకుని నక్కపల్లి వైపు వస్తుండగా.. అదే సమయంలో తహశీల్దారు కార్యాలయం సమీపంలో హైవేపై బైక్ ప్రమాదానికి గురైంది. యువకుడు కింద పడిపోయి గాయపడ్డాడు. మంత్రి అనిత వెంటనే తన కాన్వాయ్‌ను ఆపి, క్షతగాత్రుడి వద్ద వెళ్లి ధైర్యం చెప్పారు. ఇతను కోటవురట్ల మండలం రామచంద్రాపురానికి చెందిన జోగేశ్‌గా గుర్తించి, వెంటనే సీహెచ్‌సీకి తీసుకెళ్లాలని ఎస్కార్ట్ సిబ్బందిని ఆదేశించారు. దీంతో పోలీసులు కాన్వాయ్‌లోని ఒక వాహనంలోకి క్షతగాత్రుడిని ఎక్కించుకుని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి కాన్వాయ్ అక్కడి నుంచి కదిలింది.

22న గవర్నర్ అబ్దుల్ నజీర్ విశాఖ రాక

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ నెల 22న విశాఖకు రానున్నారు. బుధవారం రాత్రి 9.05 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్న ఆయన రోడ్డు మార్గంలో పోతినమల్లయ్యపాలెంలోని వైజాగ్ కన్వెన్షన్‌కు వెళతారు. అక్కడ జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొని, అనంతరం నోవాటెల్ హోటల్‌కు వెళ్లి రాత్రి బసచేస్తారు. గురువారం సాయంత్రం 4.30 గంటలకు విమానంలో బెంగళూరుకు బయలుదేరి వెళతారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

నక్కపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించి నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న విజన్ -2047 సెంటర్‌ను ఆదివారం జిల్లా అధికారులు పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయం పైఅంతస్తులో ఈ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఏసీ, కంప్యూటర్లు, ఫర్నిచర్ వంటి సామగ్రిని సిద్ధం చేశారు. ఈ పనులను ఆదివారం డీపీవో సందీప్, నియోజకవర్గం ప్రత్యేకాధికారి శచీదేవి, జిల్లా మత్స్యశాకాధికారిణి విజయ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, శానిటేషన్‌స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం గురించి ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావులతో చర్చించారు. మండల ఇంజనీర్ దుర్గా శంకర్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ శివ ప్రసాద్ , ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలకు నీళ్లు

- మండలంలో 11 దుకాణాలకు అనుమతులు
- రేకుల షెడ్లకు బదులు టెంట్లలో విక్రయాలు
- జాగ్రత్తలు పాటించని విక్రయదారులు

ఎస్.రాయవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా విక్రయాల కోసం 11 దుకాణాలకు అధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే దుకాణదారులు నిబంధనలు పాటించకుండా విక్రయాలు జరుపుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి బాణసంచా విక్రయాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని అడ్డురోడ్డు తిమ్మాపురంలో 5, ఎస్. రాయవరంలో 2, ధర్మవరం అగ్రహారంలో 2, దార్లపూడి 1, పెదగుమ్ములూరు ఒక దుకాణాలకు అధికారులు అనుమతులు ఇచ్చారు. తాత్కాలికంగా రేకుల షెడ్‌లు ఏర్పాటు చేసుకొని వాటిలో విక్రయాలు జరపాల్సి ఉండగా టెంట్లు వేసి విక్రయాలు జరుపుతున్నారు. ప్రమాదాలు జరిగితే మంటలను అదుపు చేయడానికి కావల్సిన సామగ్రి లేకుండానే అమ్మకాలు చేస్తున్నారు. ధర్మవరం అగ్రహారంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే మందుగుండు అమ్మకాల షాపులను ఏర్పాటు చేశారు. దీంతో ఏ సమయాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మందుగుండు విక్రయాలకు కావల్సిన అనుమతులకు మామూళ్లు భారీగా ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


అడ్డరోడ్డు తిమ్మాపురంలో టెంట్‌ల్లో విక్రయిస్తున్న బాణసంచా

ప్రలోభాలకు గురి చేశారు : ఎంపీపీ గోవింద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోవింద్

ఎలమంచిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):వైసీపీలో గెలిచిన వారిని ప్రలోభాలకు గురి చేసి పదవులు ఇచ్చే సంప్రదాయానికి అధికార పార్టీ నేతలు తెర తీశారని ఎంపీపీ బోదెపు గోవింద్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మునిసిపల్ వైస్ చైర్మన్ ఆరెపు గుప్తా, వైసీపీ మండల, పట్టణ అధ్యక్షులు కొల్లి త్రినాథ్, బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్లతో కలిసి ఎంపీపీ విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ మారిపొమ్మని తనకు ఆహ్వానం వచ్చిందని, కానీ తాను ఎప్పటికైనా వైసీపీలోనే కొనసాగుతానని స్పష్టం చేశానన్నారు. తనపై అవిశ్వాసం పెట్టడం పట్ల ఎటువంటి బాధ అనిపించలేదని, నాలుగేళ్ల ఎంపీపీగా హుందాగా పనిచేశానన్నారు. వైస్ ఎంపీపీ శేషుకు, తనకు వ్యక్తిగతంగా ఎటువంటి మనస్పర్థలు లేవన్నారు. ఎంపీపీ పదవి కావాలనుకుంటే తాను గౌరవంగా తప్పుకుని ఉండేవాడినని గోవింద్ అన్నారు. స్థానిక శాసనసభ్యులకు ఈ సంప్రదాయం కరెక్టు కాదన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారి కష్టం ఎలా ఉంటుందో ఎమ్మెల్యేకు తెలుసునని, అన్నీ తెలిసిన ఆయనే వేరే పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి ఎంపీపీ పదవి ఇవ్వడం అనేది ఆలోచన చేయాలన్నారు. మీ పార్టీలో గెలిచిన వారెందరో ఉన్నారని, వారికి పదవులు ఇచ్చుకోవాల్సిందిపోయి ఇతర పార్టీలో ఉన్నవారిని ప్రలోభాలకు గురిచేసే సంప్రదాయానికి తెరతీశారని గోవింద్ అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాపేటి సంతోష్, కోఆప్షన్ మెంబరు దూది నరసింహామూర్తి వైసీపీ నేతలు పాల్గొన్నారు.

చెక్కపై వెలుగుల దీపాలు


దీపాలు వెలిగించి మహిళ వెళుతున్నట్టు తయారు చేసిన ఆర్ట్

నక్కపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):దీపావళి పర్వదినం సందర్భంగా ప్రతీ ఇంటా వెలుగులు ప్రసరింపజేయాలనే ఉద్దేశంతో చిన దొడ్డిగల్లుకు చెందిన సూక్ష్మకళాకారుడు దార్లరవి తన సృజనాత్మకతతో తయారు చేసిన కళారూపం ఆకట్టుకుంది. మాతృమూర్తి దీపాలు పెట్టి నడిచివెళ్తున్నట్టుగా చెక్కిన కళాఖండం దీపాల వెలుగులను చాటిచెప్పేలా కనబడుతోంది.

రెండు గ్రామాల్లో యువత శ్రమదానం


రేగుపాలెం జంక్షన్ వద్ద రోడ్డుపై ఆదివారం గోతులను పూడ్చుతున్న యువకులు

ఎలమంచిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగుపాలెంలో ఆదివారం గ్రామానికి చెందిన యువకులు శ్రమదానంతో ప్రధాన రోడ్డుపై ఉన్న గోతులను పూడ్చివేశారు. తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు రోడ్లపై ఉన్న గోతులను పూడ్చివేసామని యువకులు తెలిపారు. అదేవిధంగా మునిసిపాలిటీలోని కొక్కిరాపల్లి వార్డులో యువ కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ ఆధ్వర్యంలో యువకులు ఆదివారం ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న తుప్పలను తొలగించారు.

రాంబిల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం రేపు

రాంబిల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరువీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 21న రాంబిల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు లయన్ తెడ్లపు వరహా సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖలోని ప్రముఖ ఆసుపత్రులకు చెందిన వైద్యులు ఈ ఉచిత వైద్య శిబిరంలో రోగులకు వైద్యసేవలు అందిస్తారన్నారు. ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్, పోలీస్ శాఖ జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతున్నారన్నారు. మండలంలోని ప్రజలు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు వరహా సత్యనారాయణ కోరారు.

మునగపాకలో సత్యసాయి పల్లకి ఊరేగింపు


మునగపాకలో సత్యసాయి పల్లకి ఊరేగింపు

మునగపాక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మునగపాక పురవీధుల్లో పల్లకి ఊరేగింపు ఘనంగా జరిగింది. స్థానిక సద్గురు షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి గ్రామ పురవీధుల్లో పల్లకి ఊరేగింపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు సూరిశెట్టి సుధారాణి, శ్రీనివాసరావు, సాయిబాబా భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

పంచదార్ల ఆలయంలో పారిశుధ్య పనులు

రాంబిల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన పంచదార్లలోని శ్రీరాధామాధవస్వామి ఆలయం వద్ద ఆదివారం మాకవరపాలెం మండలం వజ్రగాడకు చెందిన తమరాన హరికృష్ణ తన సొంత నిధులు వెచ్చించి పారిశుధ్య పనులు చేపట్టారు. ఆలయ గర్భంలో ప్రవహించే ఐదు ధారలు వద్ద పేరుకుపోయిన చెత్తను, ఆలయం ఆవరణలో ఏపుగా పెరిగిపోయిన తుప్పలను తొలగించారు. హరికృష్ణను స్థానికులు, భక్తులు అభినందించారు.

బల్క్‌డ్రగ్ పార్కు రద్దు చేయాలంటూ అంబేడ్కర్‌కు వినతి

ఎస్.రాయవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలని, నాయకుల అక్రమ గృహ నిర్బంధాలు ఆపాలంటూ ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం సత్యనారాయణ, పలువురు నాయకులు పెదగుమ్ములూరులోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయొద్దంటూ మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు మద్దతిస్తున్న నేతలను గృహ నిర్బంధాలు చేస్తుండడం దారుణమన్నారు. సెక్షన్ 30 అమలు చేసి రాజయ్యపేటకి ఎవరినీ రాకుండా చేసి ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేసే ప్రయత్నం చేస్తుందన్నారు.

మరికొన్ని జోన్ వార్తలు 8వ పేజీలో...

వైద్య కళాశాలల కోసం సంతకాల సేకరణ : ధర్మశ్రీ

మునగపాక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలలను కాపాడుకోవడం కోసం వైసీపీ కోటి సంతకాల సేకరణ చేపడుతోందని ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో ఆదివారం జరిగిన వైసీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, ఆడారి గణపతి అచ్చింనాయుడు, కాండ్రేగుల నూకరాజు, పెతకంశెట్టి రామజోగినాయుడు, మళ్ల కన్నుంనాయుడు పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి

మునగపాక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడు కోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని శ్రీమరిడి మహాలక్ష్మి దాడి వారి సంఘం గౌరవాధ్యక్షుడు దాడి ముసిలినాయుడు అన్నారు. మండల కేంద్రమైన మునగపాకలో శ్రీమరిడి మహాలక్ష్మి దాడి వారి సంఘం ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో దాడి శ్రీరామ్మూర్తి, దాడి సూర్యనారాయణ, దాడి శివ, దాడి పోలీసు, దాడి రామచంద్రరావు పాల్గొన్నారు.



నూకాంబిక ఆలయంలో ధనలక్ష్మీ పూజ


మహిళల ధనలక్ష్మీ పూజ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆశ్వీజమాసం ధనత్రయోదశి సందర్భంగా ఆదివారం రాత్రి నూకాంబిక ఆలయంలో కోలాహల వాతావరణం నెలకొంది. మహిళలు ధనలక్ష్మీ పూజచేశారు. పట్టణ ప్రజలు విచ్చేసి దర్శించుకున్నారు. ఆలయ ఈవో సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీచైర్మన్ పీలా నాగశ్రీ పాల్గొన్నారు.

వేల్పులవీధి గౌరమ్మ నిలుపు మహోత్సవం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మెయిన్ రోడ్డులోని వేల్పుల వీధి జంక్షన్‌లో గల ఆలయంలో గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ముందుగా ఆది దంపతుల విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకున్నారు. పురవీధుల గుండా ఊరేగించిన అనంతరం ఆలయంలో నిలిపారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


గౌరీపరమేశ్వరుల విగ్రహం ఊరేగింపు

నరకాసురుని వధ


నరకాసురుని బొమ్మకు నిప్పటిస్తున్న రాంకీ

కొత్తూరు, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణం గవరపాలెంలో బాలగణపతిసేవా సమితి, శివారాధ్య ఆశ్రమం ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా నరకాసుర వధను ఆదివారం రాత్రి నిర్వహించారు. జనసేన పార్టీ నియోజవకర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ముఖ్య అతిథిగా హాజరై సుమారు పదిహేను అడుగుల నరకాసురుని బొమ్మకు నిప్పంటించారు. ముందుగా చిన్నారులు నృత్య ప్రదర్శనను తిలకించి అభినందించారు. కూటమి నాయకులు కర్రి రమేష్, దూలం గోపి, హరికృష్ణ, గోవింద, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో దీపావళి వేడుకలు


దీపాలను వెలగిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్ : డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డైట్ లిటరరీ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ జ్యోతులను వెలిగించి ప్రారంభించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అకడమిక్ డీన్ డాక్టర్ వెంకట ఫణిభూషణ్, కె.ఈశ్వరరావు, షబీనాబేగం, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల మహా సభల పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వచ్చే నెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో జరగనున్న ఆశా వర్కర్స్ యూనియన్ ఐదవ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆదివారం ఇక్కడ ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ 26 జిల్లాల నుంచి మూడు వందల మంది ఆశా కార్యకర్తలు యూనియన్ ప్రతినిధులు హాజరు కానున్నట్టు చెప్పారు. జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, ప్రధాన కార్యదర్శి వి.సత్యవతి, కోశాధికారి ఇ.పార్వతి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ద్వారా టీడీపీ కార్యకర్తల సమస్యలు తెలుసుకుంటా : బాబ్జీ

సబ్బవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ స్పష్టం చేశారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటైన ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఒక్కో వారం ఒక్కో మండలంలో గ్రీవెన్స్‌కు హాజరవుతానని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, సీనియర్ నేత, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు భరణికాన బాబూరావు సహా పలువురు మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా తమ పరిస్థితి దారుణంగా ఉందని వాపోయారు. సచివాలయాల్లో వైసీపీ నేతల మాటే చెల్లుబాటు అవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై గండి బాబ్జీ స్పందిస్తూ దీపావళి తరువాత ప్రతి గ్రీవెన్స్‌కు వెళదామన్నారు.

పూర్వ విద్యార్థుల గొప్పమనసు

పరవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి చదువుకున్న వారు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. తమతో పాటు చదువుకొని ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన స్నేహితుడు వర్రి భాస్కరరావు కుటుంబానికి ఆసరాగా నిలిచారు. అందరూ కలిసి సమకూర్చిన రూ.లక్షా 20వేలను ఆదివారం పరవాడలో ఉంటున్న స్నేహితుని కుటుంబానికి అందజేశారు.

నర్సింగబిల్లిలో అ'పూర్వ' కలయిక

కశింకోట, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : నర్సింగబిల్లి ఉన్నత పాఠశాలలో 2004-2005 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా ఆదివారం కలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. పలువురు గురువులను సత్కరించారు. భోజనానంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

మరిన్ని జోన్ వార్తలు 8లో..

చెత్త కదలదు.. కంపు వదలదు!



కింతలి వేళ్లే రోడ్డులో రైతు సేవా కేంద్రం వద్ద వేస్తున్న చెత్త

రావికమతాన్ని వీడని సమస్య

మొక్కుబడిగా స్వచ్ఛతా హీ సేవా నిర్వహణ

గుట్టల్లా చెత్త కుప్పలు.. వ్యాధులతో భయంతో ప్రజలు

రావికమతం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జనావాలాస మధ్యనే చెత్త గుట్టల్లా పేరుకుపోతోంది. రావికమతం గ్రామంలో ఊడ్చిన చెత్తను ఎస్సీ కాలనీ, మీ సేవా కేంద్రం మధ్య, బీసీ హాస్టల్ వద్ద, విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో కింతలి వెళ్లే రోడ్డు పక్కన, రైతు సేవా కేంద్రం పరిసరాల్లో కుప్పలు కుప్పలుగా పడేస్తున్నారు. వర్షాలకు ఈ చెత్త కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు రేయింబవళ్లు తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పగటి పూట ఈగలు మోత మోగిస్తున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే వ్యాధుల భయంతో వారు వణికిపోతున్నారు. పాఠశాల సమీపంలోనే చెత్త కుప్పలు ఉండడంతో విద్యార్థులు నరకం చూస్తున్నారు. ఈ చెత్తను తొలగించాలని అధికారులకు పలుమార్లు వేడుకుంటున్నా, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం లేకపోతున్నదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. 'స్వచ్ఛతా నహీ సేవా' శీర్షికలతో ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించగా, సమస్యను పరిష్కరించాలని డీపీవో స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక అధికారులు పరిశీలించి, వారం రోజుల్లో చెత్తను తరలించి ప్రజలకు ఇబ్బంది లేకుండ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రెండు వారాలు గడిచినా ఈ హామీ మాత్రం అమలుకాలేదు. వారం రోజుల్లో చెత్తను తొలగించకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని బాధిత ప్రజలు హెచ్చరించారు.



ఎస్సీ కాలనీని ఆనుకుని డంప్ చేసిన చెత్త కుప్పలు

ఆనందోత్సాహాలతో దీపావళి జరుపుకోవాలి: కలెక్టర్



కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ దీపావళీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఈపండగను నిర్వహించుకోవాలన్నారు. ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. శబ్ద, వాయు కాలుష్యం లేకుండా పర్యావరణ హితంగా బాణ సంచా కాల్చాలని, ప్రజలంతా ఆనందంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక ప్రయోజనం

» ఈపీడీసీఎల్ ఎస్ఈ జీఎన్.ప్రసాద్



మాట్లాడుతున్న ఇంజనీర్ జీఎన్‌ప్రసాద్

పాడేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్‌టీ సంస్కరణలతో అందరికీ ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ జీఎన్.ప్రసాద్ అన్నారు. జీఎస్‌టీ.20పై ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణలతో విద్యుత్ వినియోగదారులకు చాలా వరకు మేలు జరిగిందన్నారు. సోలార్ ప్యానెళ్లు, విద్యుత్ పరికరాల ధరలు తగ్గాయన్నారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల లబ్ధిదారులకు మేలు జరుగుతుదన్నారు. ఈ ప్రయోజనాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఈఈ, ఏఈవో, ఇంజనీర్లు, లైన్‌మేన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

కొయ్యూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) మండలంలో బాలారం పంచాయతీ డి. మల్లవరం గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో గడుతూరి నాగరాజు అనే వ్యక్తికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటనలో నాగరాజు కుటుంబం గృహోపకరణాలు, దుస్తులు నగదు పూర్తిగా కాలి బూడిదై కట్టుబట్టలతో నిరాశ్రయిలయ్యారు. గ్రామస్థులు స్పందించి మంటలను అదుపు చేయటంతో గ్రామానికి పెనుముప్పు తప్పింది. ఈ ప్రమాదంలో రూ. లక్ష ఆస్తి నష్టం జరినట్టు అంచనా, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితకుటుంబం అధికారులను అభ్యర్థిస్తోంది.

రెండు చోట్ల తప్పిన పెను ప్రమాదం



మర్రిదాటు సమీపంలో ఓ వైపు ఒరిగిన టిప్పర్

పెదబయలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో వాహనదారులకు త్రుటిలో పెను ప్రమాదాలు తప్పాయి. ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో కుంతుర్ల పంచాయతీ మర్రిదాటులో జరుగుతున్న పైపులైను పనుల కోసం ఇసుక లోడు తరలిస్తున్న టిప్పర్ లారీ మార్గ మధ్యంలో ఓ వైపు ఒరిగిపోయింది. దీంతో డ్రైవర్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వాహనం బోల్తా పడకుండా అదుపు చేశారు. అనంతరం స్థానికులు వచ్చి ఒరిగిన లారీని నెట్టారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒడిశా నుంచి పెదబయలుకు ప్రయాణికులతో వస్తున్న ఆటో జడ్పీ జంక్షన్ వద్ద ఘాటీపైకి వెళ్లే క్రమంలో వెనుకకు జారి లోయలోకి వెళ్ళింది. దీంతో అటోలో ఉన్న ప్రయాణికులు దిగి లోయలోకి దిగిన ఆటోను నెట్టి బయటకు తీశారు. రెండు వేర్వేరు ప్రదేశాల్లో జరిగిన ఘటనకు సంబంధించి వాహనాల్లో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదాలు జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



కాలువలోకి జారిన ఆటోను పైకి లాగుతున్న ప్రయాణికులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఇంటర్ విద్యార్థి ఎంపిక



వాలీబాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయుడు రమేశ్

డుంబ్రిగుడ,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-19 స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోని వాలీబాల్ జట్టుకు స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థి ఎంపికైనట్టు పౌరశాస్త్ర ఉపాధ్యాయుడు రమేశ్‌బాబు తెలిపారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో జరిగిన పోటీల్లో వాలీబాల్ విభాగంలో ఇంటర్ మొ దటి సంవత్సరం విద్యార్థి వం తాల రమేశ్ ప్రతిభను కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. భవిష్యత్తులో రాణించి కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ప్రిన్సిపల్ వెంకటస్వామి నాయుడు, అధ్యాపకులు ఆకాంక్షించారు.

పాడి రైతులకు దీపావళి బోనస్

» విశాఖ డెయిరీ డైరెక్టర్ పిళ్లా రమాకుమారి



నరసాపురంలో డెయిరీ కల్యాణ మండపం ప్రారంభిస్తున్న డైరెక్టర్ రమాకుమారి, పక్కన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు విశాఖ డెయిరీ దీపావళి బోనస్ అందిస్తున్నట్టు విశాఖ డెయిరీ డైరెక్టర్ పిళ్లా రమాకుమారి తెలిపారు. మండలంలోని నరసాపురంలో డెయిరీ డైరెక్టర్ దాడి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో విశాఖ డెయిరీ కల్యాణ మండపాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు విశాఖ డెయిరీ అందిస్తున్న సహకారం ఇతర సంక్షేమ పథకాల గురించి ఆమె వివరించారు. చోడవరం యూనిట్ పరిధిలోని 124 పాల సంఘాల పరిధిలోని రైతులకు దీపావళి బోనస్ కింద రూ.2.5 కోట్లు జమ చేస్తున్నట్టు ప్రకటించారు.

అనంతరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ రైతులకు విశాఖ డెయిరీ చేస్తున్న సాయంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్లు గేదెల సత్యనారాయణ, నాయకులు శీరంరెడ్డి సూర్యనారాయణ, గంగాధర్, మత్స్యరాజు, మజ్జి గౌరీశంకర్ పాల సంఘాల అధ్యక్షులు, విశాఖ డెయిరీ జీఎం, మేనేజర్, పాడి రైతులు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణి దృష్టికి టీచర్ల సమస్యలు



డి. మల్లవరంలో దగ్ధమైన పూరిల్లు

పాడేరు/ డుంబ్రిగుడ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ఆ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి దృష్టికి తీసుకువెళ్లినట్టు ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ తెలిపారు. మంత్రి సంధ్యారాణిని ఆదివారం తన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారులు పని చేస్తున్నవారికి డీఈవోలుగా పదోన్నతులు కల్పించాలని,ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్‌లను నియమించాలని, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. మంత్రి స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని సూర్యనారాయణ పేర్కొన్నారు. అలాగే, భాషా పండితుల పదోన్నతులకు ప్రభుత్వం, ఆర్థిక శాఖ ఆమోదం తెలపడంపై మంత్రికి సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో గిరిజన సం క్షేమ శాఖ టీచర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.రామారావు, సంఘ ప్రతినిధులు విజేంద్రనాథ్, వెంకటరావు, కిరణ్, ప్రభాకర్, మనోరంజన్, నాగసూర్య, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం: తహశీల్దార్



బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ ఆనందరావు, ఎస్ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక తహశీల్దార్ జి. ఆనందరావు అన్నారు. ఆదివారం ఆర్అండ్‌బీ మైదానంలో ఏర్పాటు చేసిన బాణ సంచా దుకాణాలను స్థానిక ఎస్ఐ వి. వెంకటేశ్వరరావుతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నాలుగు దుకాణాలకు అనుమతులు మంజూరయ్యాయన్నారు. దుకాణాల వద్ద వినియోగదారులు క్యూలైన్ పాటించాలన్నారు. దుకాణాల మధ్య దూరం పాటించాలన్నారు. సమీపంలో ధూమపానం చేయరాదన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అదుపు చేసేందుకు నీళ్ల తొట్టిలు, ఇసుకను సిద్ధంగా ఉంచాలన్నారు. నిబంధనాలు పాటించకపోతే దుకాణాల వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్తు తరాలకు మనుగడ

» 'నో డ్రగ్స్, నో ప్లాస్టిక్'పై సైకిల్ యాత్ర



గాలికొండ వ్యూపాయింట్ వద్ద సైక్లిస్టులు

అనంతగిరి, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్తు తరాలకు మనుగడ సాధ్యమని విశాఖపట్నం సైక్లిస్ట్, ఆర్డబ్ల్యూఎస్ జేఈవో ప్రవీణ్ తెలిపారు. విశాఖపట్నం ఎన్ఏడీ నుంచి అనంతగిరి మీదుగా గాలికొండ వ్యూపాయింట్ వరకు పర్యావరణాన్ని కపాడుదాం.. నో డ్రగ్స్, నో ప్లాస్టిక్ అనే నినాదంతో సుమారు 15 మంది సైక్లింగ్ చేసుకుంటూ వచ్చారు. అనంతగిరి మీదుగా విశాఖ వెళుతున్న సమయంలో ప్రవీణ్ విలేకరులతో మాట్లాడారు. ఫ్రీ పొల్యూషన్ లేని ప్రయాణానికి నాంది పలకాలని, కాలుష్య కారకాలను తగ్గించేందుకు సైక్లింగ్ యాత్ర చేపట్టినట్టు వివరించారు. అలాగే, మన్యం అందాలు అద్భుతంగా ఉన్నాయని, ప్లాస్టిక్‌తో అందాలను పాడుచేయవద్దని కోరారు. యువత వ్యసనాలకు దూరంగా సైక్లింగ్‌పై ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. వీరిలోని వెంకటరావు అనే 62 ఏళ్ల వ్యక్తి సైక్లింగ్‌లో పాల్గొని యువతకు ఆదర్శంగా నిలిచారు. విశాఖలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువ సైక్లిస్టులు డానియేలు, నితీశ్, వెంకటేశ్వర్లు, హరి, ఆశీర్వాదం, రాహుల్, ఆదర్శ్, రాజేంద్ర, జోసెఫ్, వసంత్, మహేశ్, యాస్, మనోహర్, పాల్గొన్నారు.

మత్స్యగెడ్డ హొయలు



సుజనకోట సమీపంలో తెల్లవారు జామున మత్స్యగెడ్డ దృశ్యం

ముంచంగిపుట్టు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్ర సమీపంలో మత్స్యగెడ్డ సోయగాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఎత్తైన ప చ్చని గిరుల మధ్య వంపులు తిరుగుతూ ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ ప్రకృతి గీసిన చిత్రంలా దర్శనమిస్తోంది. ఆదివారం ఉదయం సూర్యోదయ సమయంలో గెడ్డలో ఎత్తైన గిరుల ప్రతిబింబం చూపరులను మైమరపించింది. మత్స్యగెడ్డ సోయగాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

వరి పైరు.. ఆకట్టుకునే తీరు



వనభంగి పంచాయతీ పరిసరాల్లో పంటపొలాలు

పెదబయలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలం వనభంగి పంచాయ తీ పరిసరాల్లో పంటపొలాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ఏడాదిఅధికంగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో వనభంగి పరిధిలోని పంట పొలాలకు పుష్కలంగా నీరందింది, పైరు పచ్చని చీరలు కట్టినట్టు కనువిందు చేస్తున్నాయి. చుట్టూ ఎత్తైన గిరులు, మ ధ్యలో పచ్చటి పొలాలతో ప్రకృతి అటుగా వెళ్తున్న వాహనదారులకు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో క్లిక్ మనిపించింది.

చిన్నారులతో హోమం, వేద పఠనం



సీలేరు శివాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సీలేరు, అక్టోబరు 19 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు శివాలయం యాగశాలలో ఆదివారం చిన్నారులతో హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో నూతనంగా నిర్మించిన యాగశాలలో వెంటేశ్వరస్వామి ఆలయ వేదపండితుడు రామాచారి ఆధ్వర్యంలో వేద పఠనం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. హోమం ఆవశ్యకతను చిన్నారులకు వివరించారు. అలాగే ప్రతీ ఆదివారం శివాలయంలో సీలేరుకు చెందిన పలువురు చిన్నారులకు రామాయణ, మహాభారతం తదితర పిల్లల్లో భక్తి బావాలను పెంపొందే హిందుత్వానికి సంబంధించిన వివిధ అంశాలను వివరిస్తున్నారు. శ్లోకాలను, పద్యాలను, నీతిని, నిజాయితీ కథలను రామాచారి ఉచితంగా బోధిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీఏవీ పాఠశాల ఉపాధ్యాయుడు భాస్కరరావు పిల్లలను ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పంపిణీ చేశారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మొత్తం 11 మంది లబ్ధిదారులకు రూ.10,83,997 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర అనారోగ్య సమ్యతో బాధ పడుతూ వైద్య ఖర్చులు భరించలేని నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో 90 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.90.72 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు.

ఎమ్మెల్యే రాజుకు డెయిరీ డైరెక్టర్ గేదెల సత్కారం



ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న గేదెల సత్యనారాయణ

బుచ్చెయ్యపేట అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం చోడవరం చేరుకున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుచ్చెయ్యపేట, చోడవరం మండలాల నాయకులు పాల్గొన్నారు.

పి.భీమవరం కోనేరు పరిశీలించిన ఎమ్మెల్యే



కోనేరు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

బుచ్చెయ్యపేట అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.భీమవరంలో నూతనంగా నిర్మిస్తున్న కోనేరును ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ శివుని ఆలయం నిర్మిస్తున్న తమరాన దాసును అభినందించారు. శివాలయంతో పాటు భక్తుల స్నానాల కోసం కోనేరు నిర్మించి, మధ్యలో శివుని విగ్రహం ఏర్పాటు చేస్తున్న తీరును ప్రశంసించారు. ఈ కోనేరుతో స్థానికంగా ఆధ్యాత్మికత వెల్లివెరుస్తుందని ఎమ్మెల్యే రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, స్థానిక నాయకుడు డొంకిన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో సుపథ ప్రతిభా పరీక్షలు

దేవరాపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం సపథ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. సుపథ వ్యవస్థాపకులు యూవీఎఎన్ రాజు ఆధ్వర్యంలో మాతృ భాషాభివృద్ధి, భారతీయ సంస్కృతి, శ్లోక పఠనం, గేయాలు, వ్యాచరచన, క్విజ్, మానవతా విలువల గురించి పరీక్షలు ఏర్పాటు చేశారు. 391 మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

మాడుగులలో మోస్తరు వర్షం



మాడుగులలో పడుతున్న వర్షం

మాడుగుల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఓ మాదిరిగా ఎండకాసింది. తరువాత వాతావరణం మారిపోయింది. చిరు జల్లులతో ప్రారంభమై మోస్తరు వర్షం పడింది. లోతట్టు ప్రదేశాల్లో వర్షం నీరు చేరింది.

మతి స్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

మాడుగుల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం మతి స్థిమితం లేని ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఎక్కడ నుంచి వచ్చాడో గుర్తు తెలియని సదరు వ్యక్తి రోడ్లపై తిరుగుతూ హడావిడి సృష్టించాడు. ఆర్‌సీఎం ఆసుపత్రి వైద్యులు ఉండే క్వార్టర్స్‌లోకి వెళ్లి కేకలు వేస్తూ భయపెట్టాడు. అక్కడ ఏదోలా బెదిరించి పంపేయడంతో బయటకు వచ్చేశాడు. తరువాత హైస్కూల్ కాలనీలో ఇంటి ప్రహరీ గోడ దూకి లోపలకు ప్రవేశించాడు. ఇంటిలో ఎవరూ లేక పోవడంతో బయట ఉన్న ద్విచక్ర వాహనాన్ని పడగొట్టి కర్రతో చితకబాదాడు. దీంతో వాహనం దెబ్బతింది. అలాగే మేడ పైకి వెళ్లి పూలకుండీలను ధ్వంసం చేశాడు. ఈ సంఘటనతో కాలనీ వాసులు భయాందోళ చెందుతున్నారు. పోలీసులు స్పందించాలని వారు కోరారు.

హెక్టగుడ వంతెన నిర్మాణానికి కృషిచేస్తా

» విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మెన్ సియ్యారి దొన్నుదొర



హెక్టగుడ వంతెనను పరిశీలిస్తున్న దొన్నుదొర, తదితరులు

అనంతగిరి, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎగువశోభ పంచాయతీ హెక్టగుడ గ్రామ సమీపంలోని గెడ్డపై హుద్‌హుద్ తుఫాన్‌కు కొట్టుకుపోయిన కాలిబాట వంతెనను ఆదివారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన కాలిబాట వంతెన తుఫాన్‌కు ఉధృత్తికి కొట్టుకుపోయినట్టు పలువురు ఆయనకు వివరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో ఓ చిన్నారిని మృతిచెందడంపై ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.సుబ్బారావు, పి.సందీప్, పి.భీమన్న, ధర్మన్న, తదితరులు పాల్గొన్నారు.

'చింతపల్లి తహశీల్దార్ డిప్యూటేషన్ రద్దు చేయాలి'



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్‌కు అనకాపల్లి జిల్లాకు డిప్యూటేషన్‌పై బదిలీ చేయడాన్ని రద్దు చేయాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుష దేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. చింతపల్లి తహశీల్దార్‌గా నియమితులైన జి.ఆనందరావుని కేవలం మూడు నెలల వ్యవధిలోనే నిబంధనలకు విరుద్ధంగా గిరిజన ప్రాంతం నుంచి మైదాన ప్రాంతాలకు డిప్యూటేషన్ వేయడం అక్రమమన్నారు. సాధారణంగా గిరిజన ప్రాంతంలో ఉద్యోగుల కొరత ఉంటుందని, ఈ మేరకు మైదాన ప్రాంతాల నుంచి ఉద్యోగులను ఇక్కడకు సర్దుబాటు చేస్తారన్నారు. దీనికి భిన్నంగా ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయడం తగదన్నారు.. ఆనందరావు తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తక్కువ సమయంలోనే ఆదివాసీలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలందిస్తున్నారన్నారు. నూతన రేషన్ కార్డులు జారీ, మ్యూటేషన్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో మంజూరు చేశారన్నారు. పాలన గాడిలో పడుతున్న సమయంలో జిల్లా ఉన్నతాధికారులు నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్‌పై బదిలీ చేయడం బాధాకరమన్నారు. ఇకనైనా తహశీల్దార్ డిప్యూటేషన్ వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఆందోళన చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారి పాల్గొన్నారు.

మాకవరపాలెంలో రోడ్ల అభివృద్ధికి రూ.7.2 కోట్లు

స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని మాకవరపాలెం మండలంలో రహదారుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.7.2 కోట్లు మంజూరు చేశారని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కైలాసపట్నం నుంచి చౌడువాడ, నగరం, కోడూరు మీదుగా రాచపల్లి రోడ్డుకు రూ.4.6 కోట్లు, కొండల అగ్రహారం కూడలి నుంచి లచ్చన్నపాలెం, కుసర్లపూడి మీదుగా రోలుగుంట వరకు రోడ్డుకు రూ.2.6 కోట్లు మంజూరయ్యాయని ఆయన చెప్పారు.

130 మందికి వైద్య సేవలు

నాతవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలుగొండపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 130 మందికి సేవలు అందించారు. హోమియోపతి డాక్టర్ పి.లావణ్య ఈ శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.వెంకటరమణ, కోపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ యు.గంగునాయుడు, నాయకులు దొరబాబు, పైల శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి నిరసన

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధులు ఆదివారం నిరసన తెలిపారు. అబీద్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీజేఐపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చీడిగుమ్మల శివాలయంలో లక్ష రుద్రాక్షలతో పూజలు

గొలుగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగుమ్మల శివాలయంలో ఆదివారం శివుడికి లక్ష రుద్రాక్షలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పది మంది వేద పండితులతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఆదివారం సత్యసాయి సేవా సమితి సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి రమణ, బాలవికాస్ ఇన్‌చార్జి మూర్తి, కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

చీడికాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరహాపురం స్కూల్ మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఈ నెల 17న అండర్-14, 17 విభాగాల్లో బాలురు, 18న అదే విభాగాల్లో బాలికలకు పోటీలు నిర్వహించారు. మండలంలో 13 ఉన్నత పాఠశాలల క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. 17న జరిగిన పోటీల్లో అండర్-17 బాలురు కబడ్డీ పోటీల్లో తురువోలు విజేతగా, దిబ్బపాలెం జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. ఖోఖో పోటీల్లో తురువోలు, అప్పలరాజుపురం, షటిల్ పోటీల్లో అప్పలరాజుపురం, వరహాపురం జట్లు విన్నర్, రన్నర్స్‌గా నిలిచాయి. అండర్-14 కబడ్డీ పోటీల్లో మంచాల మోడల్ స్కూల్ జట్టు విజేతగాను, అప్పలరాజుపురం స్కూల్ జట్టు రన్నర్స్‌గా నిలి చాయి. వాలీబాల్‌లో కోనాం గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల, వరహాపురం ఉన్నత పాఠశాల, ఖోఖోలో వరహాపురం, అప్పలరాజుపురం, షటిల్‌లో అప్పలరాజుపురం, దిబ్బపాలెం, చెస్‌లో చుక్కపల్లి, తురువోలు హైస్కూల్ జట్లు మొదటి రెండు స్థానాలు సాధించాయి. 18న జరిగిన అండర్-14 ఖోఖో పోటీల్లో వరహాపురం పాఠశాల జట్టు మొదటి స్థానం, కోనాం బాలికల గురుకుల పాఠశాల రెండో స్థానం కైవసం చేసుకున్నాయి. కబడ్డీలోదిబ్బపాలెం, దండిసురవరం జట్టు మొదటి రెండు స్థానాలు సాధించాయి. విజేతలకు వరహాపురం హైస్కూల్ కమిటీ చైర్మన్ మిస్కా అప్పారావుయాదవ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.వరహామూర్తి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ అప్పారావుయాదవ్

విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోండి

కె.కోటపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదలగా ముందుగా సాగాలని చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు ప్రొఫెసర్ బండారు రామచంద్రరావు సూచించారు. మండలంలోని గొండుపాలెం గ్రామంలో సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ, నిజాయితీ, పట్టుదల, కష్టపడే మనస్తత్వం ఉండాలన్నారు. అప్పుడే ఆ విద్యార్థి అత్యున్నత స్థానానికి చేరడమే కాకుండా సమాజానికి దిశా నిర్దేశం చేయగలరన్నారు. గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పురస్కారాలు అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న లెక్కల నారాయణ మూర్తి, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండల మురళీకృష్ణ, బొడ్డు అప్పలనాయుడు, కె.దండునాయుడు, దండు నాయుడును సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అలాగే కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల ఉన్నత పాఠశాలలకు చెందిన 33 మంది మెరిట్ విద్యార్థులకు విద్యాజ్యోతి సర్టిఫికెట్లు, నగదు పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బి.మంగపతిరావు, పద్మ పూజిత ఫైనాన్స్ ఎండీ బసవరాజు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గండి గోవిందనాయుడు పాల్గొన్నారు.


పురస్కారాలు, సర్టిఫికెట్లతో ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఏర్పాటు

నాతవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మర్రిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఈ ఎన్నికలను నిర్వహించారు. ఏపీటీఎఫ్ మండల నూతన అధ్యక్షుడిగా ఎస్‌వీఎన్ ఫణీంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా రొంగల రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే మండల గౌరవ అధ్యక్షులుగా ఎస్‌వీ సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్‌గా కె.సత్యనారాయణను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఆర్.వరహాలదొర వ్యవహరించడగా, ముఖ్య అతిథిగా డి.నూకరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటచంద్రం, దేముడు, సన్యాసియ్య ఎస్.జగన్నాథరావు, చంటిబాబు, అప్పన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఫణీంద్రకుమార్, రొంగల రాము

ఉత్సాహంగా జిల్లా స్థాయి యోగా పోటీలు

చోడవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉషోదయ కళాశాలలో ఆదివారం జిల్లా స్థాయి యోగా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్ర యోగా ఫెడరేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు పుల్లేటి సతీశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినీ ఈ పోటీలను ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ ప్రారంభించారు. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎనిమిది నుంచి 80 సంవత్సరాల కేటగిరీలో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు, ఈ నెల 25, 26 తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు నిర్వాహకులు సతీశ్ ప్రకటించారు. వివిధ కేటగిరీలలో 48 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు చైర్మన్ రమణాజీ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బంగారు కృష్ణ, డాక్టర్ అనిల్, గనిరెడ్డి, రమణమూర్తి, రమేశ్ పాల్గొన్నారు. బర్నికాన మోహన్‌కుమార్, కె.హరికిరణ్, పుల్లేటి గణేశ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.


పతకాలు, సర్టిఫికెట్లతో క్రీడాకారులు

వైభవంగా మరిడమ్మ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

గొలుగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగంపేట గ్రామంలో మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఉరేగింపు కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ఆర్ఎస్ఆర్ కాలనీ వద్ద దేవదాయ శాఖ నిధులతో నూతనంగా ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహం ఉరేగింపు కార్యక్రమం చేపట్టినట్టు ఆలయ కమిటీ సభ్యులు జువ్వల దేముడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.


అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

భక్తిభావంతోనే దేవుడి అనుగ్రహం

కె.కోటపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భగవంతుని అనుగ్రహం పొందాలంటే ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు సూచించారు. మండలంలోని కింతాడ పంచాయతీ శివారు కూండ్రపువానిపాలెం శ్రీరామ సత్యసాయి మందిరంలో సత్యసాయి శతవర్ష జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గ్రామ భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కె.అప్పలనాయుడు, నాగలక్ష్మి, భారతి, నారాయణపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదం పూర్వీకులిచ్చిన గొప్ప సంపద

ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ రవీంద్రన్

- శ్రీప్రకాష్‌లో ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు
- రెండు వేల మంది విద్యార్థులతో విష్ణుసహస్రనామ పారాయణం
- ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

పాయకరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం మన పూర్వీకులు మనకు ఇచ్చిన గొప్ప సంపద అని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కన్నాలయం గోపాలన్ రవీంద్రన్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఆవరణలో శ్రీప్రకాష్ ఆయుష్ చారిటబుల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ధన్వంతరి హోమం కార్యక్రమాన్ని ట్రస్ట్ వ్యవస్థాపకులు సీహెచ్‌వీకే.నరసింహారావు, రామసీత దంపతులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రవీంద్రన్ మాట్లాడుతూ ఆయుర్వేదం మనిషి ఆరోగ్యకరమైన జీవన విధానానికి దారిని చూపే ఒక దిక్సూచి అన్నారు. నేడు ప్రపంచ దేశాలు ఆయుర్వేద వైద్య ఆవశ్యకతను గుర్తించి ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. మరో ముఖ్యఅతిథి ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్య జ్ఞానంతో పాటు వినయాన్ని నేర్పుతుందన్నారు. మనిషి ఎంత ఎదిగినా ఒదిగి ఉన్నపుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పేరు ప్రఖ్యాతలు కలిగిన వ్యక్తుల జీవిత చరిత్ర చదవడం ద్వారా మనకు, మన శ్రేయోభిలాషులకు జ్ఞానప్రాప్తి కలుగుతుందన్నారు. మానవ శరీరం ఒక అద్భుతమని, మన శరీరంలో మనస్సును ఆధీనంలో ఉంచుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని తెలిపారు. అంతకుముందు డాక్టర్ రవీంద్రన్‌ని చాగంటి కోటేశ్వరరావు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా రెండు వేల మంది విద్యార్థులు సహస్ర విష్ణునామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు సీహెచ్‌వీకే.నరసింహారావు, ఆయుర్వేద ఆసుపత్రి ట్రస్టీ డాక్టర్ యు.ఇందూలాల్, సైకలాజికల్ కౌన్సిలర్ అపర్ణ శర్మ, శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, ఆయుర్వేద చికిత్సాలయం సలహాదారు ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రధాన వైద్యులు డాక్టర్ టి.రమేష్‌బాబు, డాక్టర్ ఎం.ఏసుమయ్య, ఉపాధ్యాయులు, ప్రముఖులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ప్రఖ్యాత ఆయుర్వేద వైద్యులు డాక్టర్ డీకే.రవీంద్రన్‌కు జ్ఞాపికను అందిస్తున్న ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, 'శ్రీప్రకాశ్' నరసింహారావు


హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రముఖులు. (ఇన్‌సెట్‌లో) ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

కోటవురట్ల, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోటవురట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరగనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు 18 కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. నిరుద్యోగులైన యువతి యువకులు టెన్త్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదువుకున్న 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన హాజరు కావచ్చునన్నారు. ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్సు కాపీలు తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ జాబ్‌ను నిరుద్యోగులైన యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పెట్ల లింగంనాయుడు, జానకిశ్రీనివాసరావు, పీఏసీఎస్ డైరెక్టర్ సుంకర్ బాబ్జి, సీనియర్ నాయకుడు యండపల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.


జాబ్‌మేళా పోస్టర్‌రు ఆవిష్కరిస్తున్న మంత్రి వంగలపూడి అనిత

ఆకస్మికంగా చెబితే ఎలా?

- కలెక్టర్ వచ్చేటప్పుడు ముందుగా చెప్పాలి
- ఆర్డీవోకు, సీఐకు మత్స్యకారుల వినతిపత్రం

నక్కపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కు విషయమై మత్స్యకారులు ఈనెల 12వ తేదీ హైవే దిగ్బంధం చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో చర్చించేందుకు రాజయ్యపేట గ్రామానికి వచ్చి మాట్లాడతానని కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పడంతో వారంతా అంగీకరించారు. ఇటీవల కలెక్టర్ రావల్సివుండగా కుటుంబపరమైన పనుల కారణంగా రాలేనని కలెక్టర్ అధికారుల ద్వారా సమాచారం అందించారు. కలెక్టర్ ఎప్పుడు తమ గ్రామానికి వస్తారని గ్రామస్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ సమయంలో శనివారం రాత్రి డీఎస్పీ, ఆర్డీవో తదితరులు రాజయ్యపేట వెళ్లి ఆదివారం ఉదయం 7 గంటలకు కలెక్టర్ రాజయ్యపేట వచ్చి మాట్లాడతారని చెప్పారు. దీనిపై మత్స్యకారులు అభ్యంతరం వెలిబుచ్చారు. ఆదివారం ఉదయం ఆర్డీవో వీవీ రమణ, సీఐ జె.మురళీ ఈ గ్రామానికి వెళ్లారు. షడన్‌గా కలెక్టర్ వస్తే మా సమస్యలు ఆమెకు ఎలా తెలియజేయాలి. ఒకటి, రెండు రోజులు ముందుగా సమాచారం చెప్పాలని మత్స్యకారులు కోరారు. కలెక్టర్‌తో సమావేశం గురించి పంచాయతీ ప్రజలందరికీ తెలియజేయాల్సిన అవసరం వుందన్నారు. ప్రధాన సమస్యపై ప్రజల భాగస్వామ్యం లేకుండా మొక్కుబడిగా సమావేశం నిర్వహించకూడదని కోరారు. ఈ మేరకు జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ నేతృత్వంలో ఆర్డీవో రమణ, సీఐ మురళీకి వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ ఎప్పుడు వస్తారో కాస్త ముందుగా సమాచారం ఇవ్వాలని, తమ వల్ల శాంతిభద్రతలకు ఎటువంటి ఇబ్బంది వుండదని మత్స్యకారులు హామీ ఇచ్చారు. తమ గోడు, ఆవేదన, సమస్యను కలెక్టర్ ముందు తెలియజేస్తామని చెప్పారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేస్తామని ఆర్డీవో రమణ చెప్పారు.


కలెక్టర్ సమావేశం గురించి ముందుగా సమాచారం ఇవ్వాలంటూ వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

నేటి నుంచి ఎలమంచిలి పంచరాత్రుల ఉత్సవాలు

- సర్వాంగ సుందరంగా తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారు, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు
- పట్టణ వీధుల్లో భారీ సెట్టింగ్‌లు

ఎలమంచిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పంచరాత్రుల ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా దీపావళి ప్రారంభం నుంచి నాగుల చవితి వరకూ ఈ ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఎలమంచిలి తులసీనగర్‌లోని భూలోకమాంబ, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామిల ఉత్సవాలను ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో రెండు కమిటీల పర్యవేక్షణలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ప్రధాన రోడ్డుతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో భారీ కటౌట్లు, సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. తులసీనగర్, పాతవీధి ప్రాంతాల్లోని వీధుల్లో భక్తులు ఆకట్టుకునేలా భారీ సెట్‌లను పెట్టారు.


తులసీనగర్ ఆలయంలో భూలోకమాంబ అమ్మవారు


తులసీనగర్‌లో ఆకట్టుకుంటున్న సెట్టింగ్

డివిజన్ స్థాయి క్రీడా జట్ల ఎంపిక రేపటి నుంచి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు అనకాపల్లి డివిజన్ స్థాయి క్రీడా జట్ల ఎంపిక జరగనుందని డివిజన్ కో-ఆర్డినేటర్ ఎస్‌వీ నరసింహం తెలిపారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా, చదరంగం, అథ్లెటిక్స్‌లలో జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. డివిజన్‌లోని 12 మండలాల నుంచి బాలబాలికలు హాజరు కారున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మజీ తెలిపారు.

ఘనంగా ముగిసిన జీఎస్టీ సంబరాలు


స్టాళ్లను పరిశీలిస్తున్న పీలా గోవింద, జీవీఎంసీ జడ్సీ చక్రవర్తి


,నృత్య రూపాకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ రోడ్డులో రెండు రోజులుగా జరుగుతున్న జీఎస్టీ సంబరాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. తొలుత ఎన్టీఆర్ కూడలి వద్ద విద్యార్థినుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తిలకించి అభినందించారు. అనంతరం కన్యకాపరమేశ్వరీ జంక్షన్ నుంచి చిన నాలుగురోడ్ల జంక్షన్ వరకు జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా వస్తువుల ధరలు తగ్గడంతో వివిధ రకాల వస్తువులతో ఏర్పాటైన స్టాల్‌ను వీరు పరిశీలించారు. ఈ సంబరాలు సందర్భంగా నెహ్రూచౌక్ నుంచి చిన నాలుగురోడ్ల జంక్షన్ వరకు భారీ ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. జీఎస్టీ అక్షరాలతో ఉన్న ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాదంశెట్టి నీలబాబు, పోలారపు త్రినాథ్, సూరే సతీష్, బొద్దపు ప్రసాద్, తలారి లక్ష్మీప్రసాద్, బొడ్డేడ శ్రీను తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

- ఏపీసీటీ ఎన్‌జీవోల అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు పీలా సూర్యనారాయణ


పీలా సూర్యనారాయణ

తుమ్మపాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం హర్షణీయమని ఏపీసీటీ ఎన్‌జీవోల అసోసియేషన్ విశాఖ డివిజన్ అధ్యక్షుడు పీలా సూర్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ దీపావళి కానుకగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగులకు నవంబరు నెల నుంచి ఒక డీఏను, 60 రోజుల్లో హెల్త్‌కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం ఆనందదాయకమన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌పై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందన్నారు. హెల్త్‌కార్డుల విషయంలో ప్యాకేజీని రూ.50వేల నుంచి లక్ష రూపాయలకు పెంచారన్నారు. వైద్యసేవల సీలింగ్‌ను రూ.రెండు లక్షల నుంచి ఐదు లక్షలకు పైబడేలా పెంచారని వివరించారు. దీపావళికి ముందే ఉద్యోగ సం ఘాల డిమాండ్లపై ప్రభుత్వం ఆలోచించేటట్టు కృషి చేసిన ఏపీజేఏసీ అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణలకు ఉద్యోగ సం ఘాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

జీఎస్టీ సంస్కరణలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం

- అవగాహన సదస్సులో టీడీపీ శ్రేణులకు గండి బాబ్జీ పిలుపు

సబ్బవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి పిలుపునిచ్చారు. అమృతపురంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు అధ్యక్షతన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. చరిత్రలో ఇంత వరకూ పెరిగిన ధరలు తగ్గించిన సందర్భాలు లేవన్నారు. అటువంటిది ప్రధాని మోదీ జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చి ధరలు తగ్గించే ఏర్పాట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భరణికాన బాబూరావు, గండి వంశీదీప్, గండి దేముడు, కొటాన అప్పారావు, గవర అప్పారావు, బొబ్బరి కన్నారావు, మిడతాడ మహాలక్ష్మీనాయుడు, కొరాడ శ్రీను, కరణం రామునాయుడు, పెద్దాడ రమణమ్మ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

'తాడి గ్రామాన్ని తక్షణమే తరలించాలి'

పరవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తక్షణమే తరలించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం తాడి గ్రామంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఫార్మా పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యంతో గ్రామస్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. గ్రామాన్ని తరలించడానికి కూటమి ప్రభుత్వం సర్వే నిర్వహించి చేతులు దులుపుకుందని ఆరోపించారు. భూగర్భ జలాలు కలుషితం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తరుచూ అనారోగ్యాలకు గురవుతున్నారని వాపోయారు. గ్రామాన్ని తరలించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు



స్థానికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

కార్తీక మాసోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ మాజీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, మాజీ డైరెక్టర్లు మద్దాల నారాయణరావు, పెంటకోట అనూషగణేష్, రాపేటి లీలా సంతోష్, మళ్ల సూరిబాబు, దూలం సత్యవతి, హరి, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వేదుల సూర్యప్రభ, జగన్నాథస్వామి ఆలయ మాజీ చైర్మన్ దాడి బుజ్జి, ఈవో బి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

క్రైం... crime news

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి


లక్ష్మణరావు (ఫైల్ ఫొటో)

కోటవురట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాక గ్రామంలో ట్రాక్టర్ బోల్తాపడి కౌలు రైతు శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ రమేష్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ మండలం కసిమి గ్రామానికి చెందిన చిన్నల క్ష్మణరావు (27) శనివారం స్వగ్రామం నుంచి కోటవురట్ల మండలం పాములవాక గ్రామం వచ్చాడు. గ్రామంలో కుంచా కన్నబాబు జీడీమామిడి తోటను లీజుకు తీసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన అల్లు నాగసత్య ట్రాక్టర్‌ను తీసుకొని తోటను ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు దున్నాడు. పని ముగించుకొని పాములవాక వస్తుండగా మార్గమధ్యంలో తాండవ రిజర్వాయర్ మెయిన్‌కాలువ దగ్గర ట్రాక్టర్ బురదలోకి కూరుకుపోయింది. బురద నుంచి బయటకు వచ్చే క్రమంలో వాహనం స్కిడ్ అయింది. ప్రమాదంలో లక్ష్మణరావుకు కుడివైపు పక్కల ఐరన్ రాడ్ దిగబడి బలమైన గాయాలయ్యాయి. ఈప్రమాదాన్ని గుర్తించి చుట్టుపక్కల ఉన్న వారు వచ్చి ఆయనను బయటకు తీశాడు. వెంటనే ప్రైవేట్ ఆటోలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ రాత్రి 8గంటల ప్రాంతంలో మృతిచెందాడు. మృతుడు తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఆదివారం ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

సబ్బవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారి చిన్నయ్యపాలెం వద్ద సర్వీసు రోడ్డుపై ఆదివారం జరిగి రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ పి.సింహాచలం తెలిపిన వివరాలివి. గాజువాక జగ్గు జంక్షన్ నుంచి లోడు లారీతో డ్రైవర్ వెంపల రవిచరణ్ వేకువ జామున పెందుర్తి నుంచి సబ్బవరం వైపు జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వస్తున్నాడు. చిన్నయ్యపాలెం వద్ద అదుపు తప్పి ఆగి ఉన్న మరో లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. లారీ క్యాబిన్ నుజ్జయ్యింది. డ్రైవర్ రవిచరణ్ అందులో ఇరుక్కుపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ సింహాచలం స్థానికులతో కలిసి రెండున్నర గంటల పాటు శ్రమించి క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీశారు. రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వర్షంతో జలమయం

... 5వ పేజీ తరువాయి

తెరిపిచ్చినప్పటికీ.. సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై వుంది.


'పేట'లో నీట మునిగిన ఆవాసాలు

పాయకరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పలు కాలనీలు నీటమునిగాయి. ఆనందనగర్ కాలనీ, ఇందిరా కాలనీలో ఆదివారం మధ్యాహ్నం వరకు అడుగులోతున నీరు నిలిచి ఉండడంతోపాటు ఇళ్లలోకి చేరింది. దీంతో సామగ్రి తడిపోయి పలువురు ఇబ్బంది పడ్డారు. కొంతమంది ఇళ్లలోకి వచ్చిన వర్షం నీటిని బయటకు పంపేందుకు మోటార్లు ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. ప్రైవేటు లేఅవుట్లలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ ప్రణాళికాబద్ధంగా లేకపోవడంతో వర్షం నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కాలనీల్లో కురిసిన వర్షం నీరు త్వరగా బయటకు పోవడానికి సరైన అవుట్‌లెట్‌లు లేకపోవడంతో డ్రైనేజీల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నది.


పాయకరావుపేటలో నీటమునిగిన ఆనందనగర్ కాలనీ

కోటవురట్లలో కుండపోత..

కోటవురట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు దఫదఫాలుగా భారీ వర్షం కురిసింది. వర్షం నీటితో రహదారులు వాగులను తలపించాయి. చెరువులు ఇప్పటికే నిండడంతో అలుగులు పారుతున్నాయి. గెడ్డలు, వాగులతోపాటు సర్పా, వరాహ నదుల్లో వరద ప్రవాహం పెరిగింది. రహదారులపై ఏర్పడిన గోతులు వర్షం కారణంగా మరింత పెద్దవి అవుతున్నాయి.


కోటవురట్ల కురుస్తున్న వర్షం

రిజర్వాయర్లకు వరద తాకిడి

... 5వ పేజీ తరువాయి

కాగా, ఆదివారం 280 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 459 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడం, ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ముందు జాగ్రత్త చర్యగా స్పిల్‌వేలో రెండు గేట్లు ఎత్తి 250 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడిచిపెడుతున్నట్టు జలాశయం ఏఈ డి.సూర్య చెప్పారు. రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాల్లో నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఆయన కోరారు.

పెద్దేరు నుంచి 200 క్యూసెక్కులు...

మాడుగుల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలం పెద్దేరు జలాశయంలోకి 505 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లుకాగా.. ఆదివారం సాయంత్రానికి 136.3 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో రాత్రి తొమ్మిది గంటలకు స్పిల్‌వేలో ఒక గేటు నుంచి 200 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నట్టు జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

మహిళల కోసం జెండర్ రీసోర్స్ సెంటర్లు

... 5వ పేజీ తరువాయి

నిర్వహణకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ప్రతీ రోజు సమస్యలు వింటారు. గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు జెండర్ రీసోర్స్ సెంటర్‌లో అందుబాటులో ఉంటారు. అదే విధంగా జీఆర్‌సీ కేంద్రం వద్ద ఫిర్యాదుల పెట్టె కూడా ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు లింగ వివక్ష, లైంగిక వేధింపులు, సామాజిక, ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్నట్టు అయితే ఇక్కడ ఫిర్యాదు చేయవచ్చు. సామాజిక కార్యచరణ కమిటీ సభ్యులు మహిళల సమస్యలు విని అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారు. అలాగే మహిళలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తారు. నర్సీపట్నం వెలుగు కార్యాలయం ఆవరణలో త్వరలో జెండర్ రీసోర్స్ సెంటర్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రత్నప్రభ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549